


"కుర్రాడు కలిశాడా ?" మహాలక్ష్మి మెట్లెక్కుతున్న భర్త సీతారామయ్యకు ఎదురెళ్లి అడిగింది !"

సీతారామయ్య, కుర్చీలో చతికిలబడి, మొహాన పట్టిన చెమట తుడుచుకుని "మంచి నీళ్లు తీసుకురా ! అన్నాడు.

రెండు అంగల్లో మహాలక్ష్మి మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది. గడపనానుకుని నిల్చుంది భర్త చెప్పబోయే విశేషాలు విందామని.

"కుర్రాడు ఎలా వున్నాడు ?"

"కుర్రాడికేం బాగానే వున్నాడు !"

"ఎప్పుడొస్తానన్నాడు ?"

సీతారామయ్య క్షణం మాట్లాడలేదు. ఆయన మౌనం మహాలక్ష్మికి ఆతురత కలుగ చేసింది. "అన్నీ వివరంగా చెప్పండి !" అంది.

"ముందు అన్నంపెట్టు !"

సీతారామయ్య అన్నం తిని, మంచంమీద నడుం వాల్చి చుట్ట కాల్చుకునేలోపల, మహాలక్ష్మి చకా చకా తనూ అన్నంతిని, వంటిల్లు కడుక్కొని వచ్చి, భర్త మంచం ప్రక్కన చాప పరుచుకు కూర్చుండిపోయింది.

"అబ్బాయి నిక్షేపంలా వున్నాడు. వెనకా ముందూ ఎవ్వరూలేరు. అమలాపురం దగ్గర ఓ పెంకుటిల్లు మాత్రం వుంది అంతే ఆస్తి. మిలటరీ ఎక్కౌంట్స్‌లో ఉద్యోగం పదేళ్లబట్టీ. ఇంతకుముందు జబల్‌పూర్‌లో పనిచేసి యిక్కడకు నాలుగు నెలల క్రితం వచ్చాడు."

మహాలక్ష్మికి ఈ సంబంధం కుదిరితే బావుండు అని అనిపించింది. వెంటనే ఏడుకొండలవాడికి మనసులోనే మ్రొక్కుకుంది. "రాధ పెళ్లి అయితే, దంపతులొచ్చి దర్శనం చేసుకుంటామని !"

"కట్నం అదీ..."

"అంతదాకా పోలేదు !"

"ఏం ?... అన్నీ తేల్చుకు వస్తే పొయ్యేదిగా ?"

సీతారామయ్య లేచి కూర్చున్నాడు.

"అదే ఆఫీసులో... బ్రహ్మానందం అని ఓ కుర్రాడు వున్నాడు. అతను కొద్దిగా తెలుసులే నాకు ! వస్తుంటే పలకరించి, మీ అమ్మాయిని... శంకరానికి యిద్దామనా మాష్టారూ అని అడిగాడు. అవునన్నా. అతనో క్షణం ఆలోచించి, "కుర్రాడు పైకి బాగానేవున్నాడు. పెళ్లంటే చాలా జాగ్రత్తగా వుండాలి. వెనకా ముందూ ఆలోచించి దిగండి !" అని సలహా యిచ్చాడు !"

"ఏం కుర్రాడి కేమన్నా చెడు అలవాట్లున్నయ్యా !"

"బ్రహ్మానందం యిదీ అని చెప్పలా తేల్చి!"

"అసలు విషయ మేమిటండీ ?"

"పెళ్లికొడుకు నాకు బాగా నచ్చాడు. దురలవాట్లేమీకూడ లేవుట. కట్నం అదీ

పట్టింపులేమీ లేవన్నాడు. మీ యిష్టం మీకు పూర్తిగా నచ్చితే దిగండి!'' అన్నాడు!

మహాలక్ష్మికి ఏం పాలుపోలా! ''మరేం చేద్దామని?''

''అదే ఆలోచిస్తున్నా!''

సీతారామయ్యకు తొలి సంతానం ఆడపిల్ల. పెళ్లయి అత్తారింటి కెళ్లింది. ఆ తర్వాత ముగ్గురు మొగపిల్లలు. చదువుకుని, రెక్కల కష్టం మీద తలాఒకచోట బ్రతుకుతున్నారు. బాదర బందీలు అయిపోయాయి అనుకుంటుండగా, మళ్లీ పదేళ్ల తర్వాత ఆడపిల్ల పుట్టింది. ఆ రోజుల్లో నిరోధ్‌లు, ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు లేవు. పదేళ్ల తర్వాత బారసాల పీటల మీద కూర్చోడం, సీతారామయ్యకు, మహాలక్ష్మికీ కొంత ఇబ్బంది, సిగ్గు కలుగచేసింది. అయితే పెద్ద పిల్ల, కొడుకులు ధైర్యం ఇచ్చారు.

''దాని అదృష్టమెలా వుందో! అయినా మేమంతా లేము! ముద్దు చెల్లెలు అదేగా! దాని అచ్చటా ముచ్చటా, పెళ్లి పేరంటం చదువు మేమూ బాధ్యతలు పంచుకుంటాం'' అని ఉత్సాహం, ధైర్యం ఇచ్చారు.

ఆ విధంగా రాధ గారాబంగా పెరిగింది. పుట్టినప్పుడు అర్భకంగా వున్నా, రాను రాను ఒళ్లుచేసి, పుష్పవతి అయ్యాక మరీ సోయగం, అందం, వచ్చి, రాధ అందగత్తె అనిపించుకుంది. కాకపోతే చదువబ్బలేదు. అందుకు తల్లి గారాబం, అన్నల అనురాగం కారణం. పదోతరగతి ప్యాసయింది.

అప్పట్నుంచీ పెళ్లి ప్రయత్నాలు చేస్తుంటే, ఒక్కటీ సంతృప్తికరంగా, పెళ్లి సంబంధం దొరకలేదు.

ఆ సాయంత్రం, సీతారామయ్యగారు, బ్రహ్మానందం ఇల్లు వెతుక్కుని వెళ్లాడు. సమయానికి బ్రహ్మానందం ఇంట్లోనే వున్నాడు. సీతారామయ్యగారిని మర్యాదచేసి కూర్చోబెట్టి—

''మేష్టారూ కుర్రవాడు మేడిపండు చూడగానే పిల్లనిద్దామనిపిస్తుంది. నిజానిజాలు నాకు తెలియవనుకోండి. అయినా నాకు తెలిసిన విషయాలు దాపరికం లేకుండా చెపుతాను. శంకరానికి ఉద్యోగం వుంది. కొద్దో గొప్పో ఆస్తి కూడ వుందని అతనే చెబుతాడు కుర్రాడు బాగానే వున్నాడు — మరిన్నాళ్లా పెళ్లెందుకు కాలేదూ? అంటే, చాలా రోజులుగా ఆంధ్ర దేశం వదిలి వుండటం వల్ల అని అతనే అంటాడు. సరే ఒప్పుకుందాం? మీరు గమనించారో లేదో! నాకు కట్నం పట్టింపులు లేదంటాడు.''

''అవును నాతోనూ చెప్పాడు.''

''చెప్పాడుగదా! వెధవది ఈ రోజుల్లో గుడ్డి కుక్కకుకూడ పదివేలు, పదిహేను వేలు, లాంఛనాలు, అదనీ యిదనీ ప్రాణం తీస్తున్నారె! మరి ఇతగాడేమిటీ? ఏమీ వొద్దు! పెళ్లయితే చాలు అన్నట్లుంటాడు?''

బ్రహ్మానందం చెప్పడం, ఆపి సీతారామయ్య ముఖ కవళికలు గమనించాడు. తను చెప్పేది నమ్ముతున్నాడా లేదాన్నట్లు.

సీతారామయ్యకు బ్రహ్మానందం అన్నీ విడమరచి చెబుతుంటె, చింతపండుతో తోమగా, పాత నాణేనికి అంకెలు, అక్షరాలు కనబడినట్లు, శంకరం వ్యక్తిత్వం అవగతం కాసాగింది.

''అసలు, ఆ గేదె మంచిదైతే, ఆ వూళ్లోనే కొనేవాళ్లు అన్నది సామెత. నిజంగా శంకరం చెప్పేవన్నీ నిజం అనుకుంటే, ఈ పాటికి ఆడపిల్లల తండ్రులు ఎగరేసుకుపోరుటండీ. అంతదాకా ఎందుకూ, మా చెల్లెలే వుంది బి. ఏ. ప్యాసయింది. గుట్టుచప్పుడు కాకుండా, శంకరాని కిచ్చి చేయనా!''

సీతారామయ్యకు, ఆ మాటా నిజమే అనిపించింది.

''నేనంటే సంసారం పెద్దది. కట్నాలు కానుకలు ఇచ్చుకోలేను. మీకేంటండీ పదిహేను వేలు ఇచ్చుగోగలరు. పైగాఆఖరిపిల్లంటున్నారు. నన్ను సలహా అడిగితే, తొందరపడటం మంచిది కాదూ! అంటాను!'' అన్నాడు బ్రహ్మానందం పాలు చిలికి వెన్న తీసినట్లు.

అయితే సీతారామయ్యకు శంకతీరలేదు. ''మరి అతని పూర్తి వివరాలు తెలిసే మార్గమేదీ?''

బ్రహ్మానందం శ్రీకృష్ణపరమాత్మలా నవ్వి ''మేష్టారూ, అందరూ ఆవలిస్తే పేగులు లెక్కపెడతారు. నేను ఎదట మనిషి క్షణం నిలబడితే చాలు ఎక్స్‌రే తీసినట్లు పూర్వాపరాలు చెప్పగలను. మా మిత్రులకు ఉత్తరాలు వ్రాశాను. ఇవాళో రేపో జవాబు రావాలి! రాగానే మీకు చెబుతాను. సరా?'' అన్నాడు.

సీతారామయ్య, బ్రహ్మానందం చేసిన ఉపకారానికి మహదానందపడి, ఇంటికి వెళ్లి, హిస్ మాష్టర్స్ వాయిస్‌లా అంతా భార్యకు విన్నవించాడు.

రోజులు గడుస్తున్నాయి. శంకరం వ్యవహారం తేలేదాకా, సీతారామయ్య మరో సంబంధం గురించి వాకబు చెయ్యదల్చుకోలేదు.

ఓరోజు బజార్లో, శంకరం కనపడ్డాడు. సీతారామయ్య కొంచెం ఖంగు తిన్నాడు, పలకరించాలా వద్దా అన్న మీమాంసలో వుండగానే, శంకరమే పలుకరించాడు.

''మాష్టారూ బాగున్నారా!''

''ఆ! ఆ!''

''మీరామధ్య మీ అమ్మాయి గురించి వచ్చారు మళ్లీ వస్తామన్నారు రాలేదేం?''

సీతారామయ్య గుడ్లు మిటకరించాడు. గుక్క త్రిప్పుకుని, ''మా యింటి ఆవిడ పడకేసింది బాబూ! వద్దామనుకుంటున్నా''అని, ''మీరు ఏదన్నా సంబంధం సెటిల్ చేసుకుంటున్నారా?'' అని వాకబు చేశాడు.

''సంబంధాలు చాలా వస్తున్నాయండీ. కానీ ఏదీ నిర్ణయించుకోలేదు.''

''ఎందుకనీ!''

''నాకు నచ్చిన సంబంధాలు కొన్ని వున్నాయి. ఎందుకో వాళ్లు మళ్లీ కనపడటం లేదు మీలాగానే. నాకంతగా నచ్చనివాళ్ళు తిరిగి పోతున్నారు!''

ఆ సాయంత్రం సీతారామయ్య పరుగెత్తి కెళ్లి బ్రహ్మానందానికి, శంకరం కల్పిన విషయం, తమ మధ్య జరిగిన చర్చల సారాంశం చెప్పాడు.

బ్రహ్మానందం, ముక్కాలిపీట బాసీపెట్లు వేసుకుని, చిరునవ్వి నవ్వుతూ, ''నాకు తెలుసు మాష్టారూ వాడు అమాయకుడిలా మొహం పెట్టి, సంప్రదాయం, గౌరవంకల కుటుంబాల ఇంటి అల్లుడిగా అవ్వాలని తాపత్రయ పడుతున్నాడు. వాడివల్ల కానిపని అది. ఏ తల మాసిన వెధవా వాడి మాయలకు మోసపోడు'' అని చెప్పాడు.

సీతారామయ్య, భార్యకు ఈ విషయాలన్నీ దాచక చెప్పాడు. వాళ్లిద్దరికీ, కూతురు పెళ్ళి కన్నా, ఈ శంకరం వ్యవహారం, కాశీ మజిలీ కథలాగా క్రొత్త మలుపులు తిరుగుతూ ఆసక్తికరంగా వుంది.

ఆ తర్వాత బ్రహ్మానందం మరికొన్ని క్రొత్త విషయాలు చెప్పాడు ''శంకరానికి ఇదివరకే పెళ్లయిందటండీ! ఆ పిల్లకూ వీడికీ సరిపడక, ఆ పిల్ల తాలూకు వాళ్లు తన్నడానికివస్తే, పారిపోయి చావుతప్పి కన్ను లొట్టబోయి యిక్కడకు తగులబడ్డాడట. త్రాష్టుడు. అమ్మమ్మ. వాడి మొహం చూశారా ఎప్పుడన్నా నింపాదిగా, గండు చీమలుతిన్న బెల్లంగడ్డలా వుంటుంది.''

సీతారామయ్య, ''సంబంధం తప్పిపోయింది చాలు'' అనుకున్నాడు.

ఆ తర్వాత కొన్నాళ్లకు సీతారామయ్య మహాలక్ష్మి, గుళ్లో పురాణం వింటానికి వెళ్లారు. అదిగో అక్కడ శంకరం కనపడి పలకరించాడు.

''నమస్కారం మాష్టారు! ... ఈ మధ్య నా పెళ్లయింది. ఇదిగో ఈవిడ వసుంధర మా ఆవిడ'' అని భార్యను పరిచయం చేశాడు.

సీతారామయ్యకు కుతూహలం కలిగింది. ''అత్తగారిది ఏ వూరూ?'' అనడిగాడు.

''ఈ ఊరేనండి! బ్రహ్మానందం అని మా ఆఫీసులో, నా కొలీగ్! అతని చెల్లెలు.''

సీతారామయ్య ''అమ్మనీయమ్మ! ఎంత కుట్ర జరిగిందీ!'' అనుకున్నాడు మనసులో! ఆ మాటే పైకన్నాడు.

మహాలక్ష్మి భర్తను విచిత్రంగా చూసింది. ★